సాక్షి
కామారెడ్డి
శనివారం । 29 । ఏప్రిల్ । 2023



ఫసల్ బీమాతో ప్రయోజనం

ఫసల్ బీమాతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాలా పేర్కొన్నారు.

- IIలో ▸



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు ప్రయోజనం చేకూరుతుందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /20.5

ఉదయం ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'తూకం వేసిన వడ్లను మిల్లులకు తరలించాలి'



సదాశివనగర్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం సంచులను వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం సదాశివనగర్ మండలంలోని మర్కల్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే సూచనలున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు టార్పాలిన్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్వాల్, ఆర్‌ఐ సాహిత్య, విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, విండో సీఈవో భైరయ్య, డైరెక్టర్ బత్తుల రాములు పాల్గొన్నారు.

మక్క కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష

కామారెడ్డి క్రైం: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో చర్చించారు. అధికారులతో మాట్లాడి జిల్లాలో పండిన మక్క పంట వివరాలను తెలుసుకున్నారు. రైస్‌మిల్లుల యజమానులు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ పూర్తి చేసేలా చూడాలన్నారు. సమావేశంలో అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

3 నుంచి కోర్టులకు సెలవులు

సాక్షి, కామారెడ్డి: కోర్టులకు మే 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. అయితే అత్యవసర కేసుల కోసం మే 3 నుంచి 16 వరకు కామారెడ్డి అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, 17 నుంచి 31 వరకు నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టు, మూడో అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి అందుబాటులో ఉంటారని హైకోర్టు వర్గాలు ఆదేశాలు జారీ చేశాయి.

కల్లాల్లో ధాన్యం..
కళ్లల్లో దైన్యం

- వానాకాలాన్ని తలపిస్తున్న వాతావరణం
- రోజూ కురుస్తున్న వర్షం
- తడిసి మొలకలొస్తున్న వడ్లు
- ఆందోళనలో రైతాంగం
- పంట నష్టంపై 'సాక్షి' క్షేత్ర స్థాయి పరిశీలన

వాతావరణం వానాకాలాన్ని తలపిస్తోంది. ఆకాశాన్ని రోజూ మబ్బులు కమ్మేస్తున్నాయి. తడిసి ముద్దయిన ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టే అవకాశం లేకుండా నిత్యం వర్షం కురుస్తోంది. దీంతో నానిన వడ్లకు మొలకలు వస్తుండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'సాక్షి' శుక్రవారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపింది. ఆ వివరాలు..



లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి వద్ద ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కునుకులేకుండా చేస్తున్నాయి. ఒకవైపు వడగండ్ల దాటికి చేతికొచ్చిన పంట నేలపాలవగా, మరోవైపు కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయి మొలకలు వస్తుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, రాజంపేట, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నిజాంసాగర్, గాంధారి, తాడ్వాయి తదితర మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల కుప్పలు వర్షంతో నానిపోయాయి. జిల్లాలో పలు ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం వడగండ్ల వాన పడింది. దీంతో కోతకొచ్చిన పంట చాలా వరకు పాడైంది. రాళ్లవానతో వరిగింజలన్నీ నేలరాలాయి. మరోవైపు వరి కోసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్ల వెంట కుప్పలుగా పోసి ఉంచారు. కొనుగోలు కేంద్రాలు తెరిచినా, తూకాలు వేయకపోవడంతో కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోతోంది. వడ్లు తడవకుండా టార్పాలిన్లు, కవర్లు కప్పి ఉంచినా ప్రయోజనం ఉండడం లేదు. కొందరు రైతులు వర్షం కురుస్తున్నా అక్కడే ఉండి ధాన్యం తడవకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయితే విష పురుగుల ప్రమాదం పొంచి ఉండడంతో భయపడుతున్నారు. వర్షాలు పడుతుండడంతో పాములు, తేళ్లు బయటకు వస్తాయేమోనని జంకుతున్నారు. కేంద్రాలకు తీసుకొచ్చిన వడ్లను వెంటవెంట కాంటా వేసి తరలించి ఉంటే రైతులకు తిప్పలు తప్పేవి. కొనుగోళ్లలో జాప్యంతో అన్నదాతలు ఇబ్బందిపడుతున్నారు.

కాంటాలు మొదలైతేనే..

తడిసిన ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు నానా కొర్రీలు పెడుతున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు మొదలుపెడితే తప్ప రైతుల కష్టాలు తీరేలా లేవు. అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, ధాన్యం తూకాలు వేయించడంతో పాటు మిల్లర్లతో సమన్వయం చేస్తూ బస్తాలను అన్‌లోడ్ చేయించాల్సిన అవసరం ఉంది. లేదంటే రైతులు మరింత నష్టపోయే అవకాశాలుంటాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



వదల్‌పర్తి రోడ్డు మీద వడ్ల కుప్పలు

ఇబ్బంది పడుతున్నం..



నాకు భూమి లేదు. రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేసిన. ఈసారి అన్ని రోగాలు వచ్చి పంట దెబ్బతిన్నది. అటోఇటో కొంత పంట చేతికందింది. తీసుకువచ్చి వడ్లను కుప్పలుగా పోసినం. వానతోని నానిపోయి ఇబ్బంది అవుతుంది. వడ్లకు మొలకలు వస్తున్నయి.

– చిన్న సాయవ్వ, రైతు, శెట్పల్లి సంగారెడ్డి

ఆరబెట్టడానికి వీలు లేకుండా..

జిల్లాలోని వివిధ గ్రామాల్లో వర్షంతో నానిపోయిన వడ్లకు మొలకలొస్తున్నాయి. రోజూ వర్షం కురుస్తుండడంతో నాలుగైదు రోజులుగా టార్పాలిన్లు, కవర్ల కింద కప్పి ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టే ప్రయత్నం చేసిన రైతులు.. మొలకలను చూసి ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల వడ్లకు మొలకలొచ్చాయి. శుక్రవారం కూడా కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురవడంతో రైతులు కవర్లను తీయలేదు. శనివారం వర్షం ప్రభావం తగ్గితే కవర్లను తీసి వడ్లు ఆరబెట్టాలని యోచిస్తున్నారు. మొలకలొస్తున్న వడ్లను చూసి రైతులు కంటతడిపెడుతున్నారు.



లింగంపేటలో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు

మొలకలొస్తున్నాయి



నాకు లింగంపేట శివారులో ఆరెకరాల భూమి ఉంది. వరి వేసిన. వారం రోజుల నాడు పది ట్రాక్టర్ల వడ్లు తీసుకువచ్చి కొనుగోలు కేంద్రం వద్ద కుప్పలు పోసిన. వానతో వడ్లు నానిపోయి మొలకలు వస్తున్నయి. వానలు పోతేగానీ ఆరబెట్టే పరిస్థితి లేదు.

– చెట్కూరి దేవయ్య, రైతు, ఐలాపూర్, లింగంపేట మండలం

'పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం'



తెల్గాపూర్‌లో బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్: అకాల వర్షాలు, వడగండ్లతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. శుక్రవారం సింగితం, తెల్గాపూర్, దూప్‌సింగ్‌తండాలలో పర్యటించి, నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నారాయన, వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్, ఏఈవో గ్రీష్మ, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, నాయకులు దుర్గారెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్‌గౌడ్, లింగాల రాంచందర్, పున్న నారాయణ, శ్రీధర్‌రెడ్డి, కాశయ్య, రాజేశ్వర్‌గౌడ్, జీవన్ ఉన్నారు.

పుల్కల్‌లో..

బిచ్కుంద: ఎమ్మెల్యే హన్మంత్ సింధే పుల్కల్‌లో పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని రైతులను కోరారు. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని ఆరబెట్టడానికి అన్ని వసతులు కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, వైస్ ఎంపీపీ రాజు పటేల్, నాయకులు వెంటక్‌రావు, రాజు, భూంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోకి జేపీఎస్‌లు

- వారి బాటలోనే ఓపీఎస్‌లు
- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్



ఎల్లారెడ్డిలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


ఎల్లారెడ్డి/పిట్లం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు, ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు సమ్మె బాట పట్టారు. దీంతో శుక్రవారం నుంచి పల్లెల్లో పాలన నిలిచిపోయింది. జిల్లాలో 396 మంది జూనియర్, 61 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 2019 ఏప్రిల్ 11న ఉద్యోగంలో చేరారు. మూడేళ్ల ప్రొబెషన్ పీరియడ్ అనంతరం రెగ్యులర్ చేస్తామని అప్పట్లో సర్కారు చెప్పింది. నెలకు రూ. 15 వేల వేతనం ఇచ్చింది. మూడేళ్ల అనంతరం వీరి వేతనాన్ని రూ. 28,719లకు పెంచిన సర్కారు.. ప్రొబెషన్ కాలాన్ని మరో ఏడాది పొడిగించింది. ఆ గడువూ ఈనెల 11న ముగిసింది. అయినా రెగ్యులరైజ్ చేయకపోవడంతో ఆందోళన బాట పట్టారు. జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 13న ఎంపీడీవోలకు, కలెక్టర్లకు, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్లకు సమ్మె నోటీసులను ఇచ్చారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ రెండు రోజుల క్రితం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపారు. అయినా స్పందన లేకపోవడంతో శుక్రవారం సమ్మె ప్రారంభించారు. డిమాండ్లను సాధించుకునేంత వరకు సమ్మె చేస్తామని వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుండడంతో గ్రామాలలో పాలనకు ఆటంకం కలగనుంది.

రెగ్యులరైజ్ చేయాలి

పంచాయతి కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు 15 రోజుల క్రితం సమ్మె నోటీసులు ఇచ్చాం. సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేదు. డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె చేస్తాం.

– వెంకట్‌రాములు, పంచాయతీ కార్యదర్శుల కోఆర్డినేటర్, ఎల్లారెడ్డి మండలం

సేవలను గుర్తించాలి



గ్రామ పాలనలో నాలుగేళ్లుగా కీలకంగా వ్యవహరిస్తున్నాం. మా సేవలకు గుర్తించి ప్రభుత్వం ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులనూ రెగ్యులరైజ్ చేయాలి.

– రమ్యశ్రీ, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, పిట్లం

'ట్రాఫిక్ రూల్స్ పాటించాలి'

కామారెడ్డి క్రైం: రహదారి భద్రత నియమాలు పాటించడం అందరి బాధ్యతని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి సూచికలు ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రమాదాల్లో గతేడాదిగా మృతిచెందిన వారి సంఖ్యను తెలియజేయాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బైక్‌లను అతివేగంగా నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రోడ్డుపై వేగ పరిమితికి అనుగుణంగా వాహనాలు నడిపి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని కోరారు. సమావేశంలో డీటీవో వాణి, జాతీయ రహదారి అధికారులు, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవార్డులకు పోటీపడాలి..



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: స్వచ్ఛ సర్వేక్షన్ జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం అన్ని పంచాయతీలు పోటీపడాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం స్వచ్ఛ భారత్ మిషన్, రిలయన్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్–2023పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అవార్డుల కోసం గ్రామపంచాయతీలు తీర్మానాలు చేసి, ఒక్క నిమిషం వీడియో క్లిప్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే నెలాఖరు వరకు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్‌డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాసరావు, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ నారాయణ, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి వినాయక్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా గొర్రెలు కొనాలి

కామారెడ్డి క్రైం: పారదర్శకంగా గొర్రెల కొనుగోలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టర్‌లో శుక్రవారం జిల్లా స్థాయిలో గొర్రెల కొనుగోలు బృందం అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత గొర్రెల కొనుగోలులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు నచ్చిన గొర్రెలను కొనుగోలు చేయాలని సూచించా రు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, కర్ణాటక లోని తుంకూర్, చిత్రదుర్గ, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ప్రకాశం జిల్లాలలో గొర్రెలను కొనుగోలు చేయాలన్నారు. గొర్రెల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పశు వైద్యాధికారి దేవేందర్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శా ఖ అధికారి భరత్ కుమార్, అధికారులు వెంకటేశ్వర్లు, దయానంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు భిక్కనూరుకు హైకోర్టు జడ్జి రాక

భిక్కనూరు: హైకోర్టు జడ్జి శ్రీసుధ శనివారం భిక్కనూరుకు రానున్నారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని, రైతులకు అవసరమైన న్యాయ సలహాల విషయమై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎన్.శ్రీదేవి, ఏడీజే లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

మళ్లీ జోరువాన

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో మళ్లీ వాన జోరందుకుంది. శుక్రవారం రాత్రి సైతం దంచి కొట్టింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వర్షం కురిసింది. వరి కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపై ఉంచిన రైతులు మళ్లీ వడ్లు నానిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు.

వడగండ్లతో పంటలు నాశనం

- ఎకరాకు రూ. 50 వేల పంట నష్ట పరిహారం ఇవ్వాలి
- వారం రోజుల్లో స్పందించకపోతే ఆందోళనలు చేస్తాం
- టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం
- లింగంపేట మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన



లింగంపేట మండలం బోనాల్‌లో పంటలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

సాక్షి, కామారెడ్డి/లింగంపేట: ''రైతులు ఎన్నో కష్టాలకోర్చి పంట పండిస్తారు. వడగండ్లు వారి ఆశలను తుంచాయి. పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో రైతు గోడు వినే దిక్కులేకుండాపోయింది'' అని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండలంలోని బోనాల్, శెట్పల్లి సంగారెడ్డి, నాగారం తదితర గ్రామాల్లో పర్యటించి, వడగండ్లతో పాడైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న కురిసిన వడగండ్ల వాన కొన్ని గ్రామాల్లో పంటలను మొత్తం నాశనం చేసిందన్నారు. ముప్పై నలభై ఏళ్లలో ఇలాంటి వాన రాలేదని రైతులు తెలిపారన్నారు. బోనాల్‌లో 570 ఎకరాల్లో వరి వేశారన్నారు. దాదాపు వంద ఎకరాల వరి పంట కోశారని, 470 ఎకరాల్లో పంట రాళ్ల వానతో పూర్తిగా దెబ్బతిన్నదని తమ పరిశీలనలో తేలిందన్నారు. ప్రభుత్వం బీమా పథకాలను అమలు చేసి రైతులను ఆదుకోకుండా నష్టం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా అమలు చేయకపోవడంతో రైతులకు పంట నష్టపరిహారం అందడం లేదన్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, దున్నకాలు, కూలీల ధరలన్నీ పెరిగి రైతులకు పంటల సాగు గిట్టుబాటు కావడం లేదన్నారు. వర్షాలు, వడగండ్లతో పంటలు దెబ్బతిని రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రకృతి ప్రకోపంతో నష్టపోయిన రైతులకు వారం రోజుల్లో పరిహారం ఇవ్వకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. రైతులకు పరిహారం కోసం అవసరమైతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ముందుగా పంట కోసిన రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి 25 రోజులు గడుస్తున్నా కాంటా వేయకపోవడం సిగ్గుచేటన్నారు. తడిసిన ధాన్యాన్ని ఉన్నది ఉన్నట్టుగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. మిల్లర్లు అనేక రకాలుగా దోచుకుంటున్నారని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా కన్వీనర్ కుంబాల లక్ష్మణ్ యాదవ్, టీజేఎస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జిన రమేశ్, నాయకులు యాదగిరి, పూల్‌సింగ్, గోపాల్, సాయిలు, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

కష్టాలు వింటూ.. నోట్ చేసుకుంటూ



సాక్షి, కామారెడ్డి: ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది, తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ కోదండరాం అన్నదాతల కష్టాలను తెలుసుకోవడానికి పొలం బాట పట్టారు. లింగంపేట మండలంలోని బోనాల్ గ్రామంలో అకాల వర్షాలు, వడగండ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలు విన్నారు. అన్నీ తన నోటుబుక్కులో రాసుకున్నారు. ఎకరం వరి పంట వేయడానికి విత్తనాలు ఎన్ని కావాలి? దానికి ఎంత ఖర్చవుతుంది? సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నారా? దున్నకాలకు ట్రాక్టర్ కిరాయి ఎంత? ఏ ఎరువు ఎన్ని బస్తాలు వేస్తారు? ఎరువుల ధర ఎంత? మొత్తంగా ఎకరం వరి సాగుకు ఎంత ఖర్చవుతుంది? పంట దెబ్బతిని ఎంత నష్టపోయారు? తదితర ప్రశ్నలు అడిగి, రైతులు చెప్పిన వివరాలను రాసుకున్నారు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రైతులను ఆదుకునేందుకు కోర్టుకు కూడా వెళతామన్నారు.

క్లుప్తంగా

30న బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: బీసీ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 30న పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ గురుకులాల కో–ఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పరీక్షకు 527 మంది, ఇంటర్ కోసం 2,088 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

10 నుంచి ఉచిత శిక్షణ

డిచ్‌పల్లి:డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో పురుషులకు వచ్చే నెల 10 నుంచి పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ టీవీ (13రోజులు), ఎలక్ట్రీషియన్ (హౌస్‌వైరింగ్), ఏసీ రిపేరింగ్, ఫొటోగ్రఫీ- వీడియోగ్రఫీ (30 రోజులు) కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తామని తెలిపారు. 19 నుంచి 35 ఏళ్లలోపు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి సంస్థ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08461–222428, 08461–295428 నంబర్లను సంప్రదించాలన్నారు.

శిక్షణకు హాజరు కావాలి

నిజామాబాద్‌అర్బన్: టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్ సర్టిఫికెట్ వేసవి శిక్షణ తరగతులకు ఆసక్తి గల వారు హాజరు కావాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 11 వరకు కోటగల్లీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందని వివరించారు.

జాతీయ సెమినార్‌లో డీసీసీబీ చైర్మన్



బాన్సువాడ: చెన్నైలో జరిగిన ఎన్‌ఏఎఫ్‌ఎస్‌సీవోబీ(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో ఆపరేటీవ్ బ్యాంక్స్ లిమిటెడ్) జాతీయ సెమినార్‌కు ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. టీఎస్‌సీఏబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అధ్యక్షతన తమిళనాడు రాష్ట్ర సహకార శాఖ మంత్రి తిరుకేఆర్ పెరియ కరుప్పన్ ముఖ్యఅతిథిగా హాజరైన సెమినార్‌కు తెలంగాణ డీసీసీబీ చైర్మన్లతో కలిసి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. సెమినార్‌లో సహకార బ్యాంకుల రైతులకు అవసరమయ్యే రుణాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిసింది.

చదరంగంతో చురుకుదనం

- డీఈవో దుర్గాప్రసాద్
- 'సాక్షి' వేసవి క్రీడల శిబిరానికి విశేష స్పందన
- అట్టహాసంగా ముగిసిన చదరంగం పోటీలు





సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో చదరంగం ఆడుతున్న విద్యార్థులు





మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీరావు

నిజామాబాద్‌నాగారం: చదరంగం ఆడటం ద్వారా మెదడు చురుగ్గా పని చేస్తుందని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చదరంగం పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. ఏడాది పాటు విద్యార్థులు చదువులో బిజీగా ఉంటారని, వేసవిలో విద్యార్థులను ఉత్తేజ పర్చడానికి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెస్‌లో అంతర్జాతీయస్థాయిలో దేశం నుంచి ఎంతో మంది క్రీడాకారులు ఉన్నతంగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. చెస్ ఆటలో మెదడుకు పని ఉంటుందని, ఎత్తుకు పైఎత్తులు ఉంటాయన్నారు. చెక్ పెట్టడానికి ఎన్నో ఎత్తుగడలు వేస్తామని, అలాగే మన జీవితంలో ఎదురైనా సమస్యలను, సవాళ్లను ఎదుర్కోవడానికి చెస్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఒత్తిడి తగ్గుతోంది

చెస్ ఆట మెదడును ఉత్తేజ పరుస్తుందని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు అన్నారు. చెస్‌ను ప్రతినిత్యం సాధన చేయాలన్నారు. ఒత్తిడి తట్టుకోవడానికి చదరంగం సాధన ఉపయోగపడుతుందని చెప్పారు. ఇతర క్రీడలు ఆడినా సరే చెస్‌ను సాధన చేయాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి సాక్షి యాజమాన్యం పోటీలు నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. చెస్ సాధనతో పాటు పోటీల్లో పాల్గొంటేనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. చెస్ ఆడటం ద్వారా నాలెడ్జ్ పెరుగుతుందని చెస్ ఆర్బిటరి వేణు మాధవ్ అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నటరాజ్, కళాశాల ఇన్‌చార్జి శ్రీలత, సాక్షి బ్రాంచ్ మేనేజర్ మహేష్, బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో డీఈవో దుర్గాప్రసాద్, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీరావు తదితరులు

రాష్ట్రస్థాయిలో రాణించా..



చెస్‌లో ఇప్పటికే రెండుసార్లు రాష్ట్రస్థాయికి వెళ్లి మెడల్స్ సాధించాను. చెస్‌తో నాకు మైండ్ రిలీఫ్ ఉంటుంది. అందుకే ఎలాంటి ఒత్తిడినైనా తట్టుకోగలుగుతాను. ఇంట్లో చెస్‌ను సాధన చేస్తుంటాను.

– జి అన్విత, విన్నర్, అభ్యాస స్కూల్,

'సాక్షి'కి ధన్యవాదాలు



చెస్ పోటీలు నిర్వహించినందుకు సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ పోటీల్లో పాల్గొని, బహుమతి సాధించడం చాలా సంతోషంగా ఉంది. చెస్ నిత్యం సాధన చేయడంతో నాకు ఆలోచన శక్తి పెరుగుతుంది.

– మధుశ్రీ, రన్నర్, అభ్యాస స్కూల్

మొదటి సారే విజేతగా..



నేను చెస్ పోటీల్లో మొదటిసారిగా పాల్గొన్నాను. మొదటిసారే విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. నాలుగు రౌండ్‌లలో గెలిచి, నాలుగు పాయింట్లు సాధించాను. ఇంటివద్ద నిత్యం చదరంగం సాధన చేస్తాను.

– వి చేతన్‌కుమార్,విన్నర్, విజయ్ హైస్కూల్

చెస్‌తో ఉత్సాహం



చెస్ నాలో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్నిస్తుంది. అందుకే ప్రతినిత్యం చెస్ సాధన చేస్తుంటాను. చెస్ పోటీలు ఎక్కడున్నా పాల్గొంటాను. మా పాఠశాలలో, రాష్ట్రస్థాయిలో రాణించాను.

– సృజన్‌కుమార్, రన్నర్, అభ్యాస స్కూల్

ఆటోను ఢీకొట్టిన బొలెరో

- నలుగురి పరిస్థితి విషమం



ఘటన స్థలంలో బోల్తా పడ్డ బొలెరో, ఆటో

మాక్లూర్ : మాక్లూర్ మండల కేంద్రంలోని రఫత్‌ఖాన్ గార్డెన్ సమీపంలో నందిపేట రహదారి పై శుక్రవారం బొలెరో వాహనం, ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురి కాళ్లు చేతులు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడ్డారు. నందిపేట్ వైపు నుంచి వస్తున్న ఆటోను నిజామాబాద్ నుంచి ఎదురుగా వెళ్తున్న బొలెరో వేగంగా ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ప్రయాణికులు చెల్లా చెదురుగా ఎగిరి పడ్డారు. గాయాలతో రక్తసిక్తమయ్యారు. డొంకేశ్వర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మైమూద్, సాజిదాబేగం కుడి చేతులు విరిగిపోగా, నందిపేటకు చెందిన కుమ్మరి రజిని ఎడమకాలు, మాదాపూర్‌కు చెందిన పి లక్ష్మి కుడికాలు విరిగిపోయాయి. డొంకేశ్వర్‌కు చెందిన యాసిన్‌బేగం ఆమె కుమారుడు రిజ్వాన్, జ్యోతినగర్‌కు చెందిన చీటూరి మీనా, మామిడ్ల శోభల తలలకు బలమైన గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉంది. నందిపేటకు చెందిన అంజి, మాదాపూర్‌కు చెందిన భరత్‌రావుకు స్వల్ప గాయాలయ్యాయి. బొలెరో వాహన డ్రైవర్ భగత్ నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్సై యదగిరిగౌడ్ తెలిపారు. భగత్‌కు కూడా తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదంలో ఆటో ధ్వంసం అయింది. బొలెరో వాహనం బోల్తా పడింది. క్షతగాత్రులందరినీ పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జియో ఇన్ఫర్మాటిక్స్ యూజర్స్ మీట్‌కు ఎంపిక



అజేందర్ కుమార్

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ పూర్వ విద్యార్థి మామిళ్ల అజేందర్ కుమార్, అమెరికాలోని శాండ్ డియాగోలో వచ్చే నెలలో జరిగే ప్రపంచ జియోఇన్ఫర్మాటిక్స్ యూజర్స్ మీట్‌కు శుక్రవారం ఎంపికయ్యాడు. ప్రస్తుతం అజేందర్‌కుమార్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మాటిక్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఆయన ఇటీవల తెయూ నుంచి ఐదుగురు విద్యార్థులను ఆన్‌లైన్ ప్రాజెక్టు వర్కుకు ఎంపికచేశాడని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవితతోరస్ అన్నారు. ప్రపంచ సదస్సుకు అజేందర్‌కుమార్ ఎంపికవడం సౌత్‌క్యాంపస్‌కు గర్వకారణమన్నారు. ఆయనను ఫోన్‌లో అభినందించారు.

ఫసల్ బీమాతో రైతులకు ప్రయోజనం

- కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తం రూపాలా



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రూపాలా

బిచ్కుంద: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమాతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తం రూపాలా అన్నారు. శుక్రవారం బిచ్కుందలో జహీరాబాద్ పార్లమెంట్ ప్రవాస్ యోజన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ఈ పథకం ఉంటే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేదని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మథుర లంబాడీలను ఎస్టీల్లో కలపాలని మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోమయప్ప స్వామి, నాయకులు మహిపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి, శ్రీధర్ పంతుల్, విష్ణు పాల్గొన్నారు.

హిందీలో గోదావరికి డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం పరిశోధకురాలు టక్కర్వాడ్ గోదావరి డాక్టరేట్ సాధించారు. తెయూ హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ జి.ప్రవీణబాయి పర్యవేక్షణలో 'నసీరా శర్మ కే ఉపన్యాసో మే నారికి దశ– దిశ' అనే అంశంపై గోదావరి పరిశోధన గ్రంథం సమర్పించారు. శుక్రవారం జరిగిన వైవాకు ధర్మాబాద్‌లోని ఎల్‌బీ శాస్త్రి మహా విశ్వవిద్యాలయ్ ప్రొఫెసర్ ప్రతిభ ఎరేకర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు.

క్రైం కార్నర్

బాలికను మోసం చేసిన యువకుడిపై కేసు

నాగిరెడ్డిపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన దళిత బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బాలికను అదే గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువకుడు గత మూడేళ్లుగా ప్రేమపేరుతో లోబర్చుకున్నాడు. ప్రస్తుతం ఆ యువకుడు మరో యువతిని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకోగా విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు తమ కూతురిని పెళ్లి చేసుకోవాలని కోరగా యువకుడు నిరాకరించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై అట్రాసిటీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బిచ్కుంద: మండలంలోని గుండెకల్లూర్‌లో పేకాడుతున్న ఆరుగురిని శుక్రవారం పట్టుకున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ.5,290 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్‌లో శుక్రవారం కుర్మేడెబ్బ చిన్న చిన్నయ్యకు చెందిన ఐదు గొర్రెపిల్లలపై కుక్కలు దాడిచేయడంతో మృతిచెందాయి. తన ఇంటి వెనుకాలే ఉన్నగొర్రెల మందపై కుక్కలు గుంపులుగా వచ్చి దాడి చేసినట్లు బాధితుడు తెలిపారు. గ్రామంలో ఉన్న కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ శిలారి మంజుల సుధాకర్ తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి



గంగరాజు (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పైతరి గంగరాజు(40) వ్యవసాయం చేస్తు జీవిస్తున్నాడు. శుక్రవారం వేకువజామున బహిర్భూమి కోసం చెరువు కట్టపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. గంగరాజుకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. దీన్ని గమనించిన వారు వెంటనే గజ ఈతగాళ్లతో గాలించగా గంగరాజు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ వివరించారు.

చెట్టుపై నుంచి పడి ఒకరు..

లింగంపేట:లింగంపేటకు చెందిన హైమద్‌హుస్సేన్(35) మామిడి చెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం హైమద్ హుస్సేన్ గ్రామ శివారులో గల మామిడి చెట్టుపైకి ఎక్కి కాయలు తెంపుతుండగా పడిపోయాడు. తీవ్ర గాయాలైన బాధితుడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య హసీనా, కుమారుడు ఆజిబాబా ఉన్నారు.

కరెంట్ షాక్‌తో బాలిక..



నవీపేట: మండలంలోని నాగేపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి కరెంట్ షాక్‌తో కావేరి(11) అనే బాలిక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సుమన్ కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఇంటి పనులను చూసేందుకు వచ్చిన కావేరి వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నారి మోపాల్‌లోని గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చి కొత్త ఇంట్లో ప్రమాదానికి గురై చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన కొక్కెర శ్రీనివాస్ (45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. శ్రీనివాస్ అప్పుల బాధతో ఈ నెల 25న నవీపేట శివారులో పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కుక్కను తప్పించబోయి..

నవీపేట: మండలంలోని నాగేపూర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన బోధన్‌కర్ పెద్ద గంగాధర్(37) హార్వెస్టర్ నాగేపూర్ శివారులో వరి కోతలు కోయడానికి వచ్చింది. హార్వెస్టర్‌పై డ్రైవర్, క్లీనర్లకు బాసర నుంచి గంగాధర్ ఆహారం తీసుకువస్తుండగా నాగేపూర్ శివారులో కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోగా బైక్ అదుపు పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతును బలిగొన్న అధికారుల నిర్లక్ష్యం

- ఈదురుగాలులకు తెగిపోయిన విద్యుత్ తీగలు
- సరఫరా నిలిపివేయని సిబ్బంది
- ఆ వైర్లు తాకి షాక్‌తో రైతు మృతి





నారాయణ మృతదేహం, నారాయణ(ఫైల్)

సిరికొండ: అధికారుల నిర్లక్ష్యానికి ఓ రైతు ప్రాణం బలైంది. ఈదురుగాలులకు చెట్టు పడి విద్యుత్ తీగలు తెగిపోతే.. సరఫరా నిలిపివేయమని గ్రామస్తులు చెప్పినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో ఆ తీగలను చూసుకోకుండా తాకిన ఓ రైతు మృతి చెందాడు. మండలంలోని న్యావనంది శివారులో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన ఎస్సై నర్సింలు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. న్యావనంది గ్రామానికి చెందిన నారాయణ(60) శుక్రవారం పొలానికి వెళ్లాడు. ఈ నెల 26న వీచిన ఈదురుగాలులకు నారాయణ పొలం సమీపంలో తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో తీగలు తెగిపోయాయి. అటువైపు విద్యుత్ ప్రసారం నిలిపివేయాలని రైతులు విద్యుత్ శాఖ వారికి సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు విద్యుత్ ప్రచారం నిలిపి వేయకపోవడంతో పొలం వద్దకు వెళ్లిన నారాయణ ఆ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భోజనం సమయం దాటిపోతున్న నారాయణ ఇంకా ఇంటికి రావడం లేదని అతని కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా నారాయణ మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై సిరికొండ ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పలు గ్రామాల్లో తెగిపోయిన తీగలను సరి చేశామన్నారు. చాలా చోట్ల తీగలు తెగిపోవడంతో ఆ గ్రామంలో తెగిపోయిన తీగలను తనిఖీల్లో గుర్తించలేకపోయామని చెప్పారు. ఇంకా మరమ్మతులు చేస్తునే ఉన్నామన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



కమ్మర్‌పల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోనాసముందర్, కోనాపూర్ సొసైటీల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కల్లాలో, కొనుగోలు కేంద్రంలో ఉంచిన ధాన్యంపై కవర్లు కప్పుకొని గాలికి కొట్టుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం ఆరిన తర్వాతే కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం తప్ప, తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని కోనాసముందర్ సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి ఆయన దృష్టికి తీసుకు రాగా, మిల్లర్లతో మాట్లాడుతానని చెప్పారు. కోనాపూర్ సొసైటీ చైర్మన్ బడాల రాజేందర్, తహసీల్దార్ సురేష్‌కుమార్ ఉన్నారు.

సిలిండర్ల చోరీ కేసులో ఒకరి అరెస్టు



ఖలీల్‌వాడి: ఆటోలో నుంచి సిలిండర్లు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మోపాల్ మండలం తానాకుర్దు గ్రామానికి చెందిన అచ్చ సురేందర్‌రెడ్డి నగరంలోని అహ్మదీపురా కాలనీలో ఇండేన్ గ్యాస్‌కు సంబంధించిన 10 సిలిండర్లను ఈ నెల 25న చోరీ చేశాడు. ఈ మేరకు ఆటో ఇండేన్ గ్యాస్ సిబ్బంది మహ్మద్ తెల్‌మిజ్‌ఖాన్ ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన తర్వాత నిందితుడు సురేందర్‌రెడ్డిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విచారించగా గతంలో సైతం సిలిండర్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి 25 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉదయ్‌కుమార్ ఉన్నారు.

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

మోర్తాడ్: మోర్తాడ్‌లో గంజాయి విక్రయించే ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు వెల్లడించారు. నిందితుల నుంచి 500 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలను, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. మోర్తాడ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులు ఆదిలాబాద్ జిల్లా నుంచి గంజాయిని తీసుకొచ్చి ఆరు నెలలుగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో మోర్తాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని యానాంలో ఒక ఇంటిలో గంజాయి సేవిస్తూ విక్రయించడానికి సిద్ధంగా ఉన్న నలుగురిని ఎస్సై ముత్యం రాజు అతని బృందం అరెస్టు చేసిందని ఏసీపీ తెలిపారు. మోర్తాడ్‌కు చెందిన గాడుదల రాకేష్, ఆర్మూర్‌కు చెందిన దూది రవితేజ, వడ్యాట్‌కు చెందిన మహమ్మద్ అర్షద్, ఆర్మూర్ పట్టణానికి చెందిన మరో నిందితుడు తోపారం శశి శేఖర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి ముఠా అరెస్టులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై, సిబ్బంది బాలాజీ, నారాయణ, సాయికుమార్, అక్బర్, నర్సయ్యను ఏసీపీ అభినందించారు.

డిపాజిట్ల పేరిట రూ.12 లక్షలకు టోకరా

కామారెడ్డి క్రైం: యాప్‌లో డిపాజిట్ చేస్తే అధిక మొత్తం చెల్లిస్తామని నమ్మించి ఓ వ్యక్తికి రూ.12 లక్షలు టోకరా వేశారు. కామారెడ్డిలోని ఓం శాంతి ప్రాంతంలో నివాసం ఉండే సోమన్నగారి సందీప్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. డిఫాబెట్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని సోషల్ మీడియాలో చూశాడు. దీంతో లోన్‌యాప్‌ల్లో రుణం తీసుకొని డిఫాబెట్ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. అలా విడతల వారీగా రూ.12 లక్షలు పెట్టాడు. చివరికి మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ శుక్రవారం తెలిపారు.